సాక్షి
కుమురం భీం
శనివారం । 7 । అక్టోబర్ । 2023



నీటి కుంటలు..నిండుకుండలు
కవ్వాల్ టైగర్‌జోన్‌లో వేసవిలో ఎద్దడి లేకుండా ఉండేందుకు నీటి కుంటలు నిర్మిస్తున్నారు. జన్నారం డివిజన్‌లో మూడేళ్లలో 240 కుంటలు నిర్మించారు. 8లో▸



బతుకమ్మ చీరలు పంపిణీ
జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ కొనసాగింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని లబ్ధిదారులకు చీరలు అందించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.4 /23.3

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

రెచ్చిపోతున్న కుక్కలు!

జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్ వీధిలో శుక్రవారం ట్యూషన్ వెళ్తున్న విద్యార్థులపై వీధి కుక్కలు దాడికి ప్రయత్నించాయి. కుక్కకాటు నుంచి ఓ విద్యార్థి తృటిలో తప్పించుకున్నాడు. జిల్లా కేంద్రంలో దాదాపు ప్రతీ వీధిలో కుక్కల గుంపులు ఉన్నాయి. జిల్లాలో ఇలాంటి ఘటనలు సర్వసాధారణమయ్యాయి. రోడ్లపై తిరుగుతున్న వీధికుక్కలు రెచ్చిపోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇంటి నుంచి బయటికి వెళ్తే కోతులు, శునకాల నుంచి రక్షణకు కర్రలు తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

- చిన్నారులపై వరుస దాడులు
- తాజాగా వాంకిడి మండలంలో తీవ్రంగా గాయపడిన సర్పంచ్ కుమార్తె
- శునకాల సంతతి నియంత్రణలో అధికారుల నిర్లక్ష్యం
- పదుల సంఖ్యలో గుంపులుగా రోడ్లపై సంచారం
- జిల్లా కేంద్రంలో వీరంగం సృష్టిస్తున్న కోతులు



ఆసిఫాబాద్: జిల్లాలో పిచ్చికుక్కలు నిత్యం చిన్నారులు, వృద్ధులుపై దాడులకు దిగుతున్నాయి. కొన్నిరోజులుగా తీవ్రస్థాయిలో గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఉదయం నుంచే రోడ్లపైకి చేరి పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులతోపాటు ఆడుకుంటున్న పిల్లలపై దాడులు చేస్తున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. దీంతో ప్రజలు బయటికి రావాలంటేనే జంకుతున్నారు.

రోడ్లపైనే సంచారం..
జిల్లాలో 335 పంచాయతీలతోపాటు కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఉంది. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామాల్లో సైతం వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. జిల్లా కేంద్రంలోని ప్రధాన మార్కెట్‌తోపాటు శివకేశవమందిర్, తారకరామానగర్, బజార్‌వాడి, ఇతర కాలనీల్లో పగలు రాత్రి తేడా లేకుండా దర్శనమిస్తున్నాయి. చిన్న పిల్లలపైనే అధికంగా దాడులకు దిగుతుండటంతో తల్లిదండ్రులు కర్రలతో రక్షణ వెళ్లాల్సి వస్తోంది. శునకాల సంతతి నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో వారి పర్యవేక్షణ కొరవడుతోంది. వీధి కుక్కల సమస్య పరిష్కారానికి హేతుబద్ధమైన పరిష్కారం కనుగొనాలని గతంలో సుప్రీం కోర్టు పేర్కొన్నా జిల్లాలో మాత్రం అవసరమైన చర్యలు కానరావడం లేదు.

కోతుల బెడద అధికంగానే..
జిల్లా కేంద్రంలో కుక్కలతోపాటు కోతులు సైతం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇంటి తలుపులు తెరిచిఉంటే చాలు లోపలికి ప్రవేశించి సామగ్రిని చిందరవందర చేస్తున్నాయి. ఆహార పదార్థాలతోపాటు విలువైన వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. ఇంటి పరిసరాల్లో పెంచుకుంటున్న కూరగాయలు, పండ్ల మొక్కలను నాశనం చేస్తున్నాయి. కొన్ని నెలల వ్యవధిలోనే కోతుల దాడిలో గాయపడి న వారి సంఖ్య పదుల సంఖ్య దాటింది. మూడు రోజుల క్రితం సాయినగర్‌కు చెందిన ఓ వ్యాపారిపై కోతి దాడి చేయగా ఆయన చేతికి గాయమైంది. కోతుల దాడి నుంచి తప్పించుకునే క్రమంలో కిందపడి గాయపడిన వారూ ఉన్నారు. జిల్లా కేంద్రంలో కోతులు, కుక్కల నియంత్రణ చర్యలు తీసుకుంటామని, వాటిని పట్టుకునే వారికి సమాచారం ఇచ్చామని పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ తెలిపారు.

కుక్కకాటు కేసులు ఇలా..

- జిల్లాలో ఏటా వందలాది మంది పిచ్చికుక్కల దాడికి గురవుతున్నారు. గత నెలలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలోనే 33 మంది కుక్కకాటుకు చికిత్స పొందారు. గ్రామాల్లో నాటు వైద్యం చేయించుకునే వారు ఇంకా ఎక్కువ మంది ఉంటారని తెలుస్తోంది.
- రెబ్బెన మండలంలో గడిచిన మూడు నెలల్లో 33 కేసులు నమోదయ్యాయి.
- దహెగాం మండలంలో మూడు నెలల్లో 32 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. గ్రామాల్లో శునకాలు గుంపులుగా సంచరిస్తున్నా పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.
- పెంచికల్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మూడు నెలల్లో ఎనిమిది కుక్కకాటు కేసులు నమోదయ్యాయి.
- బెజ్జూర్ పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో జూలై 13 మంది, ఆగస్టులో 14, సెప్టెంబర్‌లో 13 కుక్కకాటుతో గాయపడ్డారు.
- తిర్యాణి మండలంలో మూడు నెలల్లో 15 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి.
- కౌటాల మండలంలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో 20 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. మండలంలో వీధికుక్కల సంచారం అధికంగా ఉంది. నివారణ చర్యలపై పంచాయతీలు దృష్టి పెట్టడం లేదు.
- చింతలమానెపల్లి మండలంలో మూడు నెలల్లో 14 మంది కుక్కకాటుతో గాయపడ్డారు. బాబాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధితుల కోసం వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారి తెలిపారు.

అందుబాటులో వ్యాక్సిన్
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కుక్కకాటుకు సంబంధించిన యాంటీ రేబీస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. కుక్క కాటుకు గురైన వారు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే వ్యాక్సిన్ వేస్తారు. బాధితులు ఐదు డోసులు తీసుకోవాల్సి ఉంటుంది. నాటు వైద్యంతో ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు.
– డాక్టర్ చెన్నకేశవ, డీసీహెచ్, ప్రభుత్వ ఆస్పత్రి ఆసిఫాబాద్

వీధికుక్క దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు

- ఇంటి బయట ఆడుకుంటుండగా దాడి
- ఆసిఫాబాద్, మంచిర్యాల ఆస్పత్రుల్లో అందని వైద్యం
- ఎంజీఎంకు వెళ్లిన బాధిత కుటుంబం

వాంకిడి(ఆసిఫాబాద్): ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారిపై వీధికుక్క దాడి చేసిన తీవ్రంగా గాయపర్చిన ఘటన శుక్రవారం వాంకిడి మండలం చౌపన్‌గూడ పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌపన్‌గూడ సర్పంచ్ సిడాం అన్నిగా జీపీ పరిధిలోని సడక్‌గూడ గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఆయన నాలుగేళ్ల కుమార్తె వైష్ణవి శుక్రవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో ఇంటి బయట ఆడుకుంటుండగా ఓ వీధికుక్క దాడిచేసింది. చిన్నారి కుడి కన్ను, చెంపపై బలమైన పంటిగాట్లు పడటంతో తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మంచిర్యాలకు తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

వైద్యం కోసం వరంగల్‌కు..
మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నా అక్కడి వైద్యులు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని చిన్నారి తండ్రి సిడాం అన్నిగా ఆరోపించారు. గంటపాటు కాలయాపన చేసి తర్వాత వరంగల్‌కు రెఫర్ చేశారని పేర్కొన్నారు. కుక్కకాటుకు ఉమ్మడి జిల్లాలో వైద్యసేవలు అందకపోవడం హేయమైన విషయమన్నారు.



తీవ్ర గాయాలతో వైష్ణవి

న్యూస్‌రీల్

ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న సీనియర్ మేట్లు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని నూతన పంచాయతీల్లో సీనియర్ మేట్లుగా పనిచేస్తున్న వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నూతన పంచాయతీలను ఏర్పాటు చేసినా.. ఆయా జీపీల్లో ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్ నియామకాలు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం సీనియర్ మేట్లుగా పనిచేస్తున్న వారికి ఎఫ్‌ఏలుగా అవకాశం ఇవ్వాలని కోరారు. అలాగే ఉపాధిహామీ పథకం నిర్వహణలో కీలకంగా వ్యవహరించే మేట్లకు రోజువారీ కూలి రూ.272 అందించాలన్నారు. కార్యక్రమంలో సందీప్‌కుమార్, రాజ్‌కుమార్, శ్రీరామ్, శంకర్, ప్రవీణ్‌కుమార్, బాడీరావ్, చందు, దొడ్డాజీ, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



జీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, తదితరులు

వాంకిడి(ఆసిఫాబాద్): గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండల కేంద్రంలో రూ.20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రతీ పంచాయతీలో నూతన జీపీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముండె విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచ్ బండె తుకారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా అనంతలక్ష్మి



పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయవాదులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా జక్కుల అనంతలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీ రమేశ్, సీనియర్ సివిల్ జడ్జి యువరాజు సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు, కార్యదర్శి రాపర్తి రవీందర్, న్యాయవాదులు ముక్త సురేశ్, వెంకటేశ్వర్లు, రాజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళిత కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జీవో 342 ప్రకారం అర్హులైన దళిత కుటుంబాలకు 101 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం ఏడీ సునీతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులం సర్టిఫికెట్లు అందించలేదనే సాకుతో విద్యుత్ సబ్సిడీ అందించడం లేదన్నారు. ప్రభుత్వం వద్ద ఉన్న డేటా ఆధారంగా దళిత కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్వర్, రామయ్య, సోమేశ్వర్, గణేశ్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

కోలిండియా పోటీల్లో సత్తా చాటాలి



పోటీలు ప్రారంభిస్తున్న డీజీఎం రామారావు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి క్రీడాకారులు కోలిండియా స్థాయి పోటీల్లో సత్తా చాటాలని డీజీఎం (ఎఫ్అండ్ఏ) రామారావు అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి హైస్కూల్ మైదానంలో శుక్రవారం బెల్లంపల్లి, మందమర్రి ఏరియాలకు క్రీడాకారులకు నియర్‌బై ఏరియా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు యాజమాన్యం ముందుంటుందన్నారు. అందుకు అనుగుణంగా అన్నిఏరియాల్లో క్రీడాకారులకు కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. యాజమాన్యం అందిస్తున్న ప్రోత్సాహాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరంతర సాధనతో క్రీడానైపుణ్యాలు మెరుగుపర్చుకుంటూ కోలిండియా పోటీల్లో పతకాలు సాధించాలన్నారు. ప్రతీ క్రీడాకారుడికి క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమన్నారు. గెలుపోటములు సమానంగా స్వీకరిస్తూ క్రీడల్లో రాణించేందుకు పాటుపడాలన్నారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డీవైపీఎం తిరుపతి, సీనియర్ పీవో ప్రశాంత్, ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరి రావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, మందమర్రి ఏరియా జనరల్ కెప్టెన్ చిన్నన్న పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి ‘కొండా’ పేరు పెట్టాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వాంకిడి(ఆసిఫాబాద్): జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని పద్మశాలి సంఘం నాయకులు కోరారు. శుక్రవారం మండల కేంద్రానికి వచ్చిన జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతిపత్రం అందించారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం బాపూజీ ఎంతో పోరాటం చేశారని గుర్తుచేశారు. నాయకులు నాగుల మహేశ్, సతీశ్, సంతోష్, రామకృష్ణ, సాయి, రాకేశ్ తదితరులు ఉన్నారు.

గుడుంబా నియంత్రణకు చర్యలు

- ఎస్పీ సురేశ్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో గుడుంబా, దేశీదారు, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాయలంలో శుక్రవారం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ జ్యోతికిరణ్‌తో కలిసి గుడుంబా నియంత్రణపై సంయుక్త సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి గుడుంబా, దేశీదారు, గంజాయి అమ్మకాలను నియంత్రించాలన్నారు. గుడుంబా తయారు చేసినా, నిల్వ చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ అమ్మకాలపై సమాచారం ఉంటే ప్రజలు పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గుడుంబా నిర్మూలన కోసం జిల్లా వ్యాప్తంగా తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజలకు అండగా బీఎస్పీ’



పనులు ప్రారంభిస్తున్న బీఎస్పీ నాయకులు

చింతలమానెపల్లి(సిర్పూర్): ప్రజలకు బీఎస్పీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి అన్నారు. చింతలమానెపల్లి మండల కేంద్రంలోని అంతర్గత రహదారులకు శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత రహదారులు గుంతలతో అధ్వానంగా మారాయని గ్రామస్తులు స్థానిక ఎంపీటీసీ జాడి సుశీలకు తెలిపారని అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచనలతో తామే శ్రమదానం చేపట్టామన్నారు. మొరం వేసి గుంతలను పూడ్చివేశామని తెలిపారు. అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. దళితబంధు, గృహలక్ష్మి, బీసీ బంధు లాంటి పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు తలొగ్గకుండా ఎన్నికల్లో ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మొర్లె గణపతి, జిల్లా కార్యదర్శి కొండా రాంప్రసాద్, నియోజకవర్గ అధ్యక్షుడు డోకె రాజన్న, మండల అధ్యక్షుడు లహంచు తదితరులు పాల్గొన్నారు.

‘అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు’



మాట్లాడుతున్న ఉపేందర్

ఆసిఫాబాద్: అరెస్టులతో సెకండ్ ఏఎన్ఎంల ఉద్యమాన్ని ఆపలేరని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లోని డీహెచ్ కార్యాలయం ఎదుట మహా ధర్నాలో పాల్గొన్న సెకండ్ ఏఎన్ఎంలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సరికాదన్నారు. అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గత నెలలో సమ్మె చేసినప్పుడు రాతపూర్వకంగా ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఆయన వెంట నాయకులు టి.దివాకర్, మధుకర్, చిరంజీవి, వికాస్, మృదుల్ మండల్, ముస్తాక్ ఉన్నారు.

విద్యార్థుల భవితకు వరం.. అల్పాహారం

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభం



బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు



విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న అదనపు కలెక్టర్, జెడ్పీ వైస్‌చైర్మన్

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అల్పాహారం విద్యార్థుల భవితకు వరమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీఈవో అశోక్‌తో కలిసి సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించడంతో వారి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రతీ పాఠశాలలో ప్రభుత్వం సూచించిన మెనూ పాటించాలని ఆదేశించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిన్నారుల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. పిల్లల కడుపు నిండితేనే మేధస్సు చురుకుగా ఉంటుందన్నారు. చదువులో రాణించేందుకు దోహదపడుతుందన్నారు. ప్రతిరోజూ వెరైటీలతో 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ఎంపీడీవో శశికళ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో..
కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంపు ప్రభుత్వ పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం జెడ్పీ వైస్‌చైర్మన్ మాట్లాడుతూ 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టడం చాలా గొప్ప విషయమన్నారు. పిల్లలకు మరింత పౌష్టికాహారం అందుతుందని, హాజరు సైతం మెరుగుపడుతుందన్నారు. అలాగే చదువులో ఏకాగ్రత కూడా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్‌చైర్మన్ రాచకొండ గిరీశ్, ఎంఈవో భిక్షపతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

28న కుమురంభీం వర్ధంతి

- ఘనంగా ఉత్సవం నిర్వహిద్దాం
- ప్రసంగాలు ఉండవు.. సాంస్కృతిక కార్యక్రమాలకే పెద్దపీట
- కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్
- జోడేఘాట్‌లో సన్నాహక సమావేశం



జోడేఘాట్‌లోని భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రతినిధులు

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఈ నెల 28న కుమురం భీం 83వ వర్ధంతి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. జోడేఘాట్‌లో వర్ధంతి, దర్బార్ ఏర్పాట్లను శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి పరిశీలించారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాధిపై పూలు చల్లి పూజలు చేశారు. అనంతరం మ్యూజియంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. వర్ధంతికి తరలివచ్చే ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ప్రస్తుతం 24 మరుగుదొడ్లు ఉన్నాయని, తాత్కాలికంగా మరికొన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హట్టి నుంచి జోడేఘాట్ వరకు ఐదు బస్సులు నడపాలని, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ నుంచి కూడా ప్రత్యేక బస్సులు వేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. స్టాళ్ల ఏర్పాటు చేసి ఐటీడీఏ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను గిరిజనులకు వివరించాలన్నారు. ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేయాలన్నారు. దర్బార్‌లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది ఎలాంటి ప్రసంగాలు ఉండవని, కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే పెద్దపీట వేస్తామని తెలిపారు. ప్రత్యేక భోజన వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. మూడు రోజుల ముందు నుంచే వందమంది పారిశుధ్య కార్మికులు పనిచేయాలని సూచించారు. రాయిసెంటర్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. వర్ధంతికి వారం ముందు మరోసారి సన్నాహక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అప్పటివరకు అన్ని పనులు పూర్తిచేయాలన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే గుర్తింపు
సీఎం కేసీఆర్‌తోనే జోడేఘాట్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జోడేఘాట్ అభివృద్ధికి రూ.25 కోట్లు కేటాయించారని, జిల్లాకు వచ్చి పోడు పట్టాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు. 30 డబుల్ బెడ్రూం ఇళ్లకు త్వరలోనే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. ఫారెస్టు అనుమతులు వస్తే వావుదాం నుంచి ఆసిఫాబాద్‌కు రోడ్డు వేస్తామన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న బావిని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అచ్చేశ్వరరావు, ఈఈ భీంరావు, డీఎంహెచ్‌వో తుకారాం, డీడీ రమాదేవి, ఏటీడీఏ పురుషోత్తం, ఐసీడీఎస్ పీడీ సావిత్రి, ఐకేపీ ఏపీడీ రామకృష్ణ, ఎంపీపీ మోతీరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, సర్పంచ్ సోనిబాయి, నాయకులు ఆత్రం లక్ష్మణ రాజేశ్వర్, మడావి రఘునాథ్, భీంరావు, ధర్మా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్మీకి సీవోఈ విద్యార్థి ఎంపిక



పవన్‌కళ్యాణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివిన తాళ్ల పవన్ కళ్యాణ్ ఆర్మీలో సోల్జర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైదులు, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య పవన్‌కళ్యాణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కాగా, పెద్దపల్లి జిల్లా తురకల కుంట గ్రామానికి చెందిన పవన్‌కళ్యాణ్ ఇంటర్మీడియెట్ ఎంపీసీలో 906 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పూదరి నగేశ్, పెరుగు తిరుపతి, ఉపాధ్యాయులు వామన్, రాకేశ్, కుమార్, రాజలింగు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గొడవకు కారణమైన ఒకరిపై కేసు

మంచిర్యాలక్రైం: గత నెల వినాయక నిమజ్జనంలో తలెత్తిన చిన్న గొడవ కత్తుల దాడికి దారి తీసింది. నిమజ్జనం మరునాడు ఈ గొడవతో రెండు గ్రూపులు కొట్టుకునే వరకు వెళ్లింది. ఇనుప రాడ్లు, క్రికెట్ బ్యాట్లతో దాడి చేసుకుని బీభత్సం సృష్టించారు. ఈ ఘటనలో రెండు వర్గాలవారు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు గొడవకు కారణమైన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు ఆరుగురిని రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి జిల్లా కేంద్రంలో ఓ గ్యాంగ్‌ను పెంచి పోషిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఇల్లు కూల్చిన వారిపై ఫిర్యాదు



కూల్చిన తన ఇంటిని చూపుతున్న బాధితుడు శివనారాయణ

తాండూర్: మండలంలోని బోయపల్లి గ్రామ శివారులోగల తన హోటల్, ఇల్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కొలిపాక శివ నారాయణ తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం పోలీస్ ఉద్యోగి అయిన మాసాడి క్రాంతికుమార్, ల్యాండ్ సర్వేయర్ సత్యనారాయణ, నేషనల్ హైవే స్టాఫ్ దౌర్జన్యంగా తన రెయిన్‌బో హోటల్, ఇంటిని జేసీబీతో కూల్చారని ఆరోపించాడు. ఆ హోటల్ ద్వారానే తాను ఉపాధి పొందుతున్నట్లు తెలిపాడు. హోటల్, ఇల్లు కూల్చిన వారిపై కఠినచర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

ఎస్సైపై డీఎస్పీకి ఫిర్యాదు

కాగజ్‌నగర్‌టౌన్/బెజ్జూర్: తనను చితకబాదారని శుక్రవారం రాత్రి బెజ్జూర్‌కు చెందిన బైక్ మెకానిక్ బీ తిరుపతి కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశాడు. రెండు నెలల క్రితం బెజ్జూర్ ఎస్సై విక్రమ్ బైక్ మరమ్మతు చేయాలని ఇందుకు అవసరమైన రూ.12వేలు ఇవ్వాలేదని తెలిపాడు. దీంతో తాను మరమ్మతు చేయలేదన్నాడు. శుక్రవారం ఉదయం ఎస్సై తనను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఇద్దరు కానిస్టేబుళ్ల సాయంతో చితకబాదారని ఆరోపించాడు. దీనిపై బెజ్జూర్ ఎస్సైని వివరణ కోరగా.. తిరుపతిని కొట్టలేదన్నారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ను సంప్రదించగా, బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. కాగా, బాధితుడి కాళ్లకు గాయాలు కాగా, కాగజ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

నీటికుంటలు... నిండుకుండలు..!

- సత్ఫలితాలిస్తున్న నీటి కుంటలు
- పెరుగుతున్న భూగర్భ జలాలు
- తీరుతున్న వన్యప్రాణుల దాహార్తి



నిండు కుండలా కల్పకుంట



తాళ్లపేట్ రేంజ్‌లో నిండుగా నీటి కుంట

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌కు గుండెకాయ లాంటిది జన్నారం అటవీ డివిజన్. విస్తీర్ణంలో చిన్నగా ఉన్నా.. అత్యధిక వన్యప్రాణులు ఇక్కడే అవాసం ఏర్పరుచుకున్నాయి. నీలుగాయిలు, సాంబర్లు, చుక్కల దుప్పులు, కొండగొర్రెలు, కుందేళ్లు, అడవి దున్నలు, అడవి పందులు, ముళ్లపందులు, కృష్ణ జింకలు, అడవి కుక్కలు ఇలా రకరకాల వన్యప్రాణులు జన్నారం అటవీ డివిజన్‌లో కనిపిస్తాయి. వన్యప్రాణులకు వేసవిలో దాహం తీర్చేందుకు గతంలో సాసర్ వెల్‌లు, నీటి తొట్లు ఏర్పాటు చేసేవారు. వాటిలో వేసవిలో ట్రాక్టర్ల ద్వారా నీటిని పోసేవారు. ఇది వన్యప్రాణులకు ఇబ్బందిగా మారింది. దీంతో అటవీ అధికారులు వినూత్నంగా ఆలోచించారు. వేసవిలోనూ అటవీ ప్రాంతంలో నీరుండేలా ఆలోచించి నీటి కుంటల తవ్వకాలు చేపట్టారు. వీటితో వేసవిలో వన్యప్రాణులు దాహం తీర్చుకుంటుండగా భూగర్భజలాలు పెరిగాయి.

మూడేళ్లలో 240 కుంటలు..

జన్నారం అటవీ డివిజన్‌లో గతంలో 100 నీటి కుంటలుండేవి. మాధవరావు ఎఫ్‌డీవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు పలు రకాల ప్రయత్నాలు చేశారు. చివరికి వానాకాలంలో నీరు వృథా పోకుండా ఎక్కడికక్కడే నీటి కుంటల నిర్మాణం చేయాలని ఆలోచించారు. డివిజన్‌లో మూడేళ్లలో ఉపాధిహామీ పథకం కింద కొత్తగా 240 నీటి కుంటలు నిర్మించారు. వీటితోపాటు ట్రెంచ్‌ల తవ్వకాలు చేపట్టారు. దీంతో వానాకాలంలో వరదనీరు చేరి నీటి కుంటలు నిండు కుండల్లా మారాయి. వానాకాలంలో నీటికి అడ్డు కట్టలు వేస్తూ ఒడిసి పట్టడం ద్వారా వేసవిలో వీటి ఫలితాలు కనిపిస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

పెరిగిన భూగర్భ జలాలు

అడవుల్లో నీటిని ఒడిసి పట్టడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. రెండేళ్లుగా ట్యాంకర్లతో నీటిని పోసే పద్ధతికి స్వస్తి పలికారు. గతంలో మాదిరిగా సాసర్‌వెల్, నీటి తొట్లు ఏర్పాటు చేయడం.. అందులో నీరు పోయడం లాంటి చర్యలు మానేశారు. వేసవిలో ర్యాంప్ వెల్‌లు నిర్మించారు. సహజసిద్ధంగా భూమి నుంచి నీరు ఊరేలా ర్యాంప్ వెల్‌లను తవ్వించారు. అందులోకి వన్యప్రాణులు దిగి నీరు తాగేందుకు వీలుగా ర్యాంప్‌లా ఏర్పాట్లు చేశారు. వీటిని బట్టి చూస్తే నీటి కుంటల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

70 చోట్ల ఊట కుంటలు

వేసవిలో కొన్ని నీటి కుంటలు ఎండిపోయినా ఊట కుంటలతో నీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. డివిజన్‌లో 70 చోట్ల ఊట నీటితో కుంటలు ఏర్పాటు చేశారు. వేసవిలో ఇక ట్యాంకర్‌తో నీరు నింపాల్సిన అవసరం లేకుండా తగు చర్యలు చేపడుతున్నారు. నూతన టెక్నాలజీని ఉపయోగించి నీటి సమస్య రాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

నీరు పోసే విధానానికి స్వస్తి చెప్పాం



వేసవిలో నీటి సమస్య ఏర్పడి వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా సాసర్ వెల్‌లలో ట్యాంకర్ల ద్వారా నీరు పోసే పద్ధతి ఉండేది. నూతనంగా ఆలోచించి భూగర్భ జలాలను పెంచితే వేసవిలో సహజ సిద్ధమైన నీటిని అందించవచ్చని నీటి కుంటల నిర్మాణం చేపట్టాం. దీని ద్వారా వేసవిలో భూగర్భ జలాలు పెరగడంతో ర్యాంప్‌వెల్, ఊట కుంటలు తవ్వించి సహజ సిద్ధమైన నీటిని వన్యప్రాణులకు అందిస్తున్నాం.

– సిరిపురం మాధవరావు, డిప్యూటీ కన్జర్వేటర్

స్వచ్ఛ ఆటోడ్రైవర్లకు పెండింగ్ వేతనాలు అందజేత



చెక్కు అందజేస్తున్న బాల్క సుమన్

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న స్వచ్ఛ ఆటోడ్రైవర్లకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలకు సంబంధించిన రూ.18.50 లక్షల చెక్కును శుక్రవారం ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అందజేశారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలని 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు అధికారులు స్పందించారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించి పెండింగ్ వేతనాలు మంజూరు చేయించారు. డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తూ 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

డిస్మిసల్ కార్మికులకు అవకాశం

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థలో కొంతకాలం పని చేసి 1.1.2019 నుంచి 31.12.2022 లోపు డిస్మిస్ అయిన కార్మికులను పలు షరతులతో తిరిగి ఉద్యోగంలోకి తీసుకోనున్నట్లు ఏరియా జీఎం మనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగం కావాలనుకునే వారు పనిచేసిన గనులు, డిపార్ట్‌మెంట్లపై అధికారులను కలిసి ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంస్థ అందించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని జంతువు మృతి



మృతి చెందిన నక్కలాంటి జంతువు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వైపు వెళ్లే రోడ్డు మలుపు వద్ద జాతీయ రహదారి పక్కన గురువారం రాత్రి ఓ గుర్తు తెలియని అటవీ జంతువు మృతి చెందింది. వివరాలు.. గుడిపేట జాతీయ రహదారి పక్కన రాత్రి ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో నక్కను పోలి ఉన్న ఓ అటవీ జంతువు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సమాచారం అటవీ బీట్ అధికారి దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి స్పందన రాలేదు. అటవీ జంతువు మృతిపై కనీసం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించాల్సి ఉండగా.. అధికారులు ఫొటోలు చూసి నక్క, తోడేలు లాంటి జాతికి చెందిన జంతువు కాదని, అది ఒక కుక్క అని నిర్ధారణకు రావడంతో అంతా విస్తుపోతున్నారు. రాత్రి వరకు కూడా ఘటనా స్థలికి రాకపోవడంతో దాని కళేబరం అక్కడే ఉన్నది. రోజూ గస్తీలో ఉంటున్నామని చెబుతున్న అటవీ అధికారులు, సిబ్బంది ఓ అరుదైన జంతువు రోడ్డు పక్కనే చనిపోయి ఉందని తెలిసినా స్పందించక పోవడం శోచనీయమని పలువురు పేర్కొంటున్నారు. కాగా, స్థానికులు మాత్రం చనిపోయింది తోడేలు లాగా ఉందని చర్చించుకున్నారు.

గంజాయి తరలిస్తున్న ఒకరి అరెస్ట్



పట్టుబడ్డ గంజాయి, నిందితుడు

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ ఆకుల అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన షేక్ షాహిద్ అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నాడని అందిన సమాచారం మేరకు అతడు వెళ్తున్న ఆటోను పోలీసులు తనిఖీ చేశారు. అందులోని రూ.2,500 విలువైన కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. షాహిద్‌ను పట్టుకుని విచారించగా గోదావరిఖనిలోని తెలిసిన వారికి విక్రయించేందుకు వెళ్తున్నట్లు తెలిపాడు. విచారణ కోసం అతడితోపాటు గంజాయిని సీసీసీ నస్పూర్ పోలీసులకు అప్పగించారు.

మద్యం మత్తులో కిందపడి ఒకరి మృతి

మంచిర్యాలక్రైం: మద్యం మత్తులో స్థానిక హమాలీవాడ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో కిందపడిన వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హమాలీవాడకు చెందిన మల్యాల రామకృష్ణ (40) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై పనికి వెళ్లడం లేదు. ఈ నెల 5న పనికి వెళ్తున్నాని ఇంటినుంచి వెళ్లాడు. మద్యం సేవించి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో కిందపడ్డాడు. తలకు దెబ్బతగిలిందని స్థానికులు రామకృష్ణ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి రామకృష్ణ కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అప్పటికే ఆయన మృతిచెందాడు. రామకృష్ణకు భార్య శారద, కూతురు ప్రశాంతి ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

తిర్యాణి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై చుంచు రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మందగూడ గ్రామపంచాయతీ పరిధి చింతలమాదర గ్రామానికి చెందిన ఆత్రం కృష్ణ (19) గత నెల 28న సాయంత్రం పని నిమిత్తం స్వగ్రామం నుంచి తిర్యాణి వైపునకు తన ద్విచక్రవాహనంపై అతివేగంగా వెళ్తున్నాడు. సాలేగూడ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను గమనించక పోవడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఆపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కృష్ణ తల, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి నాగుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన మహిళ..

మంచిర్యాలక్రైం: విద్యుత్ షాక్ తగిలిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పాత గర్మిళ్లలో నివాసముంటున్న సిద్దం అనూష (25) గత నెల 28న ఇంటి వద్ద ఉతికిన బట్టలు ఇనుపరాడ్‌పై ఆరవేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయింది. వెంటనే స్థానిక మెడిలైఫ్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి గత నెల 30న తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. అనూషకు భర్త లక్ష్మణ్‌తోపాటు కూతురు ఉంది. మృతురాలి తండ్రి బద్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సోలార్ విద్యుత్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న జీఎం సంజీవరెడ్డి

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ వన్ ఇంక్లైన్ గని ఆవరణలో త్వరలో ప్రారంభించనున్న 27.5 మెగావాట్ల సోలార్ విద్యుత్ స్థలాన్ని, చెన్నూర్ టూ ఇంక్లైన్ గని ఆవరణలో 11 మెగా వాట్ల సోలార్ విద్యుత్ పనులను శుక్రవారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి విద్యుదుత్పత్తిని ప్రారంభించాలని, దానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీజీఎం సివిల్ ఆనంద్‌కుమార్, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గుండె రావు, ఏరియా వర్క్‌షాప్ ఎగ్జిక్యూటివ్ రాకేశ్ తదితరులున్నారు.

'గుర్తింపు' ఎన్నికలకు నామినేషన్లు షురూ

శ్రీరాంపూర్: సింగరేణిలో ఏడో దఫా గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ మొదలైంది. శుక్రవారం నామినేషన్ల ప్రకియ ప్రారంభమైంది. శనివారం నామినేషన్లకు చివరిరోజు. ఈ నెల 9వ తేదీన ఉపసంహరణ ఉంటుంది. మొదటి రోజు పలు కార్మిక సంఘాల నాయకులు నామినేషన్ వేశారు. ప్రధాన సంఘాల్లో ఏఐటీయూసీ, హెచ్ఎమ్మెస్, బీఎంఎస్, సీఐటీయూ, ఐఎన్టీయూసీ సంఘాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్న డెప్యూటీ సీఎల్సీ శ్రీనివాసులకు నామినేషన్లు అందించారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య, హెచ్ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య నామినేషన్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాగా, టీబీజీకేఎస్ నాయకులు రేపు నామినేషన్ వేయనున్నారు.

హాకీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో శుక్రవారం ఏరియా స్థాయి హాకీ పోటీలు నిర్వహించారు. ఏరియా ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో కేకే, ఎస్కే గ్రూపు జట్లు గెలుపొందగా, కాసిపేట-1, కాసిపేట-2 జట్లు రన్నర్‌గా నిలిచాయి. కంపెనీ లెవెల్‌లో పోటీల్లో ఏరియా జట్టు రాణించాలని ఎస్వోటూ జీఎం ఆకాంక్షించారు. కార్తీక్, రవికుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: కంపెనీ స్థాయిలో జరిగిన బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బహుమతులు సాధించిన క్రీడాకారులను ఏరియా జీఎం బీ సంజీవరెడ్డి అభినందించారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఇల్లందులో కంపెనీ స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో శ్రీరాంపూర్ నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొని బహుమతులు సాధించారు. బాడీ బిల్డింగ్ 75 కిలోల కేటగిరీలో లక్ష్మణ్ (సపోర్ట్ మన్, ఎస్సార్పీ-1) ప్రథమ స్థానం, 55 కిలోల విభాగంలో సుధాకర్ (జనరల్ మజ్దూర్ ఆర్కే-7) ద్వితీయ స్థానం, 90 కిలోల విభాగంలో రమేశ్ (ఓవర్‌మెన్, ఆర్కే-7) ద్వితీయ స్థానంలో నిలిచారు. వెయిట్ లిఫ్టింగ్ 81 కిలోల విభాగంలో అజయ్ (జనరల్ మజ్దూర్, ఆర్కే న్యూటెక్) ప్రథమ స్థానం, పవర్ లిఫ్టింగ్‌లో 74కిలోల విభాగంలో ఎస్కే ఇమ్రాన్ (జనరల్ మజ్దూర్ ఆర్కే-6) ద్వితీయ స్థానం, 104 కిలోల విభాగంలో రంజిత్‌కుమార్‌రెడ్డి (జనరల్ మజ్దూర్, ఆర్కే-7) ద్వితీయ స్థానం, 84కిలోల విభాగంలో కుమారి ప్రియాంక (పర్సనల్ డిపార్ట్‌మెంట్, శ్రీరాంపూర్) ద్వితీయ స్థానం, 47కిలోల విభాగంలో కుమారి నవ్య (జనరల్ మజ్దూర్, పర్సనల్ డిపార్ట్‌మెంట్, శ్రీరాంపూర్) ద్వితీయ స్థానం సాధించారు. వీరిని జీఎం కార్యాలయంలో శుక్రవారం జీఎం సంజీవరెడ్డి శాలువాలతో సత్కరించి అభినందించారు. కంపెనీ స్థాయి పోటీల్లో ఏరియా ప్రతిష్టను నిలిపారని కొనియాడారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి, ఏరియా ఎస్వోటూ జీఎం కే రఘుకుమార్, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ అధికారులు ఎం.శ్రీనివాస్, డీజీఎంలు చిరంజీవి, రాజేశ్వర్‌రావు, స్పోర్ట్స్ కార్యదర్శి పాలకుర్తి రాజు, న్యూటెక్ సంక్షేమాధికారి సృజన్‌పాల్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ తోట సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల రిలే దీక్ష ప్రారంభం



దీక్ష శిబిరంలో కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. శుక్రవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో దీక్ష ప్రారంభించారు. మొదటిరోజు జీఎం కార్యాలయం ప్రధాన గేటు ఎదుట ధర్నా చేశారు. అనంతరం జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. 10 సంవత్సరాల నుంచి కనీస వేతనాల జీవోను సవరించడం లేదని తెలిపారు. కోలిండియాలో ఇస్తున్నట్లుగా హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 22ను ప్రభుత్వం విడుదల చేసి సంవత్సరమైనా గెజిట్ చేసి కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. దీంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గట్టు మహేందర్, డివిజన్ కార్యదర్శి వేల్పుల కుమారి, అధ్యక్షురాలు కళావతి, నాయకులు స్వరూప, నాగరాజు, సాయి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు 13 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో జీఎం మనోహర్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో గతంలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం యువతకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తీసుకున్న వారిలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు 13మంది ఎంపికయ్యారు. శుక్రవారం వీరు ఏరియా జీఎం ఆఫీస్‌లో జీఎం మనోహర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణ ఎంతో మేలు చేసిందని సంతోషం వ్యక్తంజేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ.. సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ యువత కోసం సింగరేణి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రోత్సహిస్తోందని తెలిపారు. 13మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం గర్వంగా ఉందని, ఎంపికైనవారు ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. అధికారులు, ఆఫీస్ సిబ్బంది ఉన్నారు.

మహిళా రిజర్వేషన్‌పై హామీ వచ్చేదాకా పోరాటం

పాతమంచిర్యాల: మహిళా రిజర్వేషన్‌లో బీసీ మహిళల వాటా ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదారి చంద్రమోహన్, గౌరవాధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఎంపిక ఫలితాల్లో బీసీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈడబ్ల్యూఎస్ కోటాతో 5శాతం జనాభా లేని ఓసీలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించడంతో బీసీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌చారి, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, నాయకులు మోహనకృష్ణ, శేఖర్, రాజేశ్, వంశీ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'మధ్యాహ్నం' తంటా!

- ఇంటినుంచే టిఫిన్‌బాక్స్‌లు తెచ్చుకుంటున్న విద్యార్థులు



హరిజనవాడ స్కూల్ ఎదుట ఖాళీ కంచాలతో నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు



హరిజనవాడ, స్టేషన్‌రోడ్, రాళ్లపేట్ స్కూల్‌లో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడుల్లో వంట చేసే కార్మికులు ఆందోళన బాట పట్టగా మధ్యాహ్న భోజనానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటుండగా.. మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే తాత్కాలిక వంట మనిషితో వంట చేయిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో ఎస్ఏ-1 పరీక్షలు జరుగుతుండటంతో ఉదయం వచ్చే విద్యార్థులు ఇంటికి వెళ్తుండటం.. మధ్యాహ్నం వచ్చే విద్యార్థులు ఇంట్లోనే తినివస్తుండటంతో కాస్త ఊరట కలిగిస్తోంది. కొన్ని హైస్కూళ్లలో మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులు చేస్తుండగా.. కొన్నింట్లో ఉపాధ్యాయులే తాత్కాలిక వంటమనుషులను ఏర్పాటు చేసుకున్నారు. ప్రైమరీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటినుంచే లంచ్ బాక్స్‌లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంఈవో కార్యాలయ ఆవరణలోనే ఉన్న స్టేషన్ రోడ్, హరిజనవాడ, రాళ్లపేట్ స్కూల్‌ను 'సాక్షి' పరిశీలించింది. 45మంది విద్యార్థుల్లో ఎక్కువ మంది ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తిన్నారు. ఇంకోవైపు ఈ పాఠశాల (ఎంఈవో ఆఫీస్) ఎదుట వంటకార్మికులు నిరసన తెలిపారు.

ఖాళీ ప్లేట్లతో వంటకార్మికుల నిరసన

డిమాండ్లు నెరవేర్చాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ చేపట్టిన ఆందోళనలో భాగంగా శుక్రవారం మంచిర్యాల ఎంఈవో కార్యాలయం ఎదుట ఖాళీ కంచాలు ప్రదర్శిస్తూ వంట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి మాట్లాడుతూ.. కొత్త మెనూ, కోడిగుడ్డుకు అదనపు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వరాదని పేర్కొన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.